ఎన్నికలు ఈవీఎంల ద్వారానే..

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి

ఆదిబట్ల, నవంబర్ 27 : ఎన్నికలను ఈవీఎంల ద్వారానే నిర్వహించాలని భారత దేశ ప్రధాన న్యాయస్థానం సుప్రీంకోర్టు సమర్థించిందని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఈవీఎంలు ట్యాంపరింగ్ చేయరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందన్నారు. భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టి వేసిందని తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషినర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు.

ఈవీఎంలు పూర్తిగా నమ్మకమైనవి

వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, నవంబర్ 27 : ఎన్నికల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) పూర్తిగా నమ్మకమైనవని, ట్యాంపరింగ్ చేయరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని వికారాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టి వేసిందన్నారు. ఈవీఎం ట్యాంపరింగ్‌పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన సమయంలో మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల వైఖరిని ఎత్తి చూపిందని వివరించారు. ఈవీఎంలను ప్రజలను నమ్మాల్సిన అవసరం ఉందన్నారు. ఈవీఎంలకు ఎలాంటి సిగ్నల్ వ్యవస్థ ఉండదని, హ్యాకింగ్ కావన్నారు.



ఉప్పల అనిల్‌కుమార్-భావన వివాహ వేడుకలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివాహ వేడుకలో పాల్గొన్న కేటీఆర్

కడ్తాల్, నవంబర్ 27: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇబ్రహీంపట్నంలోని మన్నెగూడలో ఉన్న బీఎంఆర్ సార్థ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్నారు. మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కుమారుడు డాక్టర్ అనిల్‌కుమార్-డాక్టర్ భావన వివాహ వేడుకలో కేటీఆర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితారెడ్డి, నారాయణరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుర్కా జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంత రావు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రజినీరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కొనుగోలు కేంద్రాల పరిశీలన

కొడంగల్ : వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, నవంబర్ 27 : తగిన ప్రణాళికతో సజావుగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట మండల పరిధిలోని బురాన్‌పూర్, తుంకిమెట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల్లో సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం నిల్వల వివరాలు, కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేపట్టి ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తూకం వేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత రైస్ మిల్లులకు సరఫరా చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. వరి కొనుగోళ్లు పూర్తయిన వెంటనే వివరాలు నమోదు చేసి రైతుల ఖాతాలోకి బోనస్‌తో కలిపి డబ్బు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పరిశీలన

అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. వివరాలు నమోదు చేసే సమయంలో ఎన్యూమరేటర్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

అలాగే ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకంపై వివరాలు సేకరించడంతో పాటు పరిశీలించారు. ప్రస్తుతం వంటకాలపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ రోజువారీగా ఇలాంటి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి మధ్యాహ్న భోజనంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలతో పాటు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. పప్పు కూరగాయలతో పాటు ఆకు కూరలు వండాలని తెలిపారు.

హస్నాబాద్‌లో..

కొడంగల్ మండల పరిధిలోని హస్నాబాద్‌లో మండల ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్, ఎంపీడీవో ఉషశ్రీతో కలిసి దుద్యాల మండల పరిధిలోని హస్నాబాద్‌లో ఉన్న పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి మోహన్‌బాబు, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం సందర్శన

పరిగి : పట్టణంలోని బాలసదనాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా బాలసదనంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనం ఎందుకు పూర్తి కాలేదని డీడబ్ల్యూవో కృష్ణవేణిని అడిగారు. నిధులు సరిపోలేదని ఆమె సమాధానం ఇచ్చారు. ఎన్ని నిధులు అవసరమవుతాయని కలెక్టర్ అడుగగా రూ.5లక్షల వరకు ఖర్చవుతాయని ఆమె చెప్పారు. నిధులు మంజూరు చేస్తానని, వెంటనే పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో కరీం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలి

వికారాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యం శాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో మా ట్లాడారు. శీతాకాలంలో వచ్చే వ్యాధులపై వసతి గృహ సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన వారికి చికిత్సలు నిర్వహించాలన్నారు. అందుబాటులో మందులు ఉంచాలన్నారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఉప వైద్యా ధికారి జీవరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీటీడీవో రామేశ్వరీదేవి

కడ్తాల్, నవంబర్ 27: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామేశ్వరీదేవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మైసిగండిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహ పరిసరాలు, వంటగది, స్టోర్‌రూం, రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వసతి గృహం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సబ్జెక్ట్‌లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో బాలరాజు, జూనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాపయ్య, సరిత, సంతోశ్, వెంకటయ్య, నయిమొహిద్దీన్, రమ్య, భగవతి, సునీత, పీడీ మంజుల, ఏఎన్ఎం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న అదనపుకలెక్టర్ ప్రతిమాసింగ్

పరిశ్రమల ప్రతినిధులు సహకరించాలి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల, నవంబర్ 27: జిల్లాలోని విద్యార్థుల ఆరోగ్యం, విద్య కోసం ప్రధాన పరిశ్రమ ప్రతినిధులు సీఎస్ఆర్ కింద సహాయ సహకారాలు అందించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫర్నిచర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, దవాఖానల్లో అవసరమైన వసతులు కల్పించాలన్నారు. ఇప్పటికే వివిధ రంగాల్లో సీఎస్ఆర్ కింద సహకారం అందిస్తున్న పారిశ్రామికవేత్తలను అదనపు కలెక్టర్ అభినందించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలి

- విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- శేరిగూడలో పాఠశాలల ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన చైర్మన్

శేరిగూడ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 27 : విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంపై నాణ్యత పాటించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు విన్నవించారు. ఆరు నుంచి ఏడు నెలలకోసారి బిల్లులు వస్తున్నాయని తెలిపారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉంటే ప్రభుత్వం నుంచి రూ.5 మాత్రమే వస్తున్నాయన్నారు. సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మధ్యాహ్న భోజనం వండేందుకు కట్టెల పొయ్యిని వాడడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని కార్మికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు పాఠశాలల్లో అందుతున్న విద్యపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనంలో బియ్యం నాణ్యమైన రావడం లేదని, ముక్కిపోయిన బియ్యంతో వండిన అన్నం తినాలంటే ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థులు, కార్మికులు తెలిపిన వివరాలు వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈవో సుశీందర్ రావు, ఇబ్రహీంపట్నం ఎంఈవో హీర్యానాయక్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

పల్లెప్రగతితో గ్రామాల అభివృద్ధి భేష్

ప్రశంసించిన సిక్కిం రాష్ట్రం గ్రామ సర్పంచ్‌లు

కడ్తాల్, నవంబర్ 27: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో తెలంగాణలోని గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి సాధించాయని సిక్కిం రాష్ట్రానికి చెందిన గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు కితాబునిచ్చారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాల్లో కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఎన్ఐఆర్డీపీఆర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిక్కిం రాష్ట్రానికి చెందిన సర్పంచ్‌లతో ఆయన సమావేశమై, గత ఐదేండ్లలో (2019-2024 వరకు) గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తడి-పొడి చెత్తను వేరు చేసే విధానం, పల్లెప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం, ఇంకుడు గుంతల నిర్మాణాలు, గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలను వివరించారు. ఆరోగ్యకర గ్రామాలను తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములుగా ఉండాలనే ఉద్దేశంతో అందరితో చర్చించి సమష్టి నిర్ణయాలు తీసుకోవడంతో గ్రామాలను అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అంజన్‌కుమార్ బాంజియా, అసోసియేట్ ప్రొఫెసర్ రవిబాబు, సిక్కిం రాష్ట్రం గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ సాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్

వికారాబాద్, నవంబర్ 27 : బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవ సాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్ పేర్కొన్నారు. బుధవారం బాల్య వివాహాల ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ అనంతగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాల్య వివాహ నిర్మూలనకు చేయాల్సిన విధివిధానాలను వివరించారు. బాల్య వివాహాలు జరిపిస్తే వారిపై చర్యలు ఉంటాయన్నారు. ఈ వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిర్మూలనకు పాటు పడతామని విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలి

దోమ : ఊటుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దోమ, నవంబర్ 27 : విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకంలో నిర్వాహకులు వండిన వంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఇలాగే ఉంటుందా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పర్యవేక్షణ లోపం జరిగితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఆహారంలో పప్పు, కూరగాయలు, ఆకుకూరలను తప్పక వండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కులకచర్ల : మండల పరిధిలోని సాల్వీడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యతను పరిశీలించారు. నాణ్యతతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ముందుగానే తేమ శాతాన్ని పరిశీలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో అన్ని రకాల వసతులు ఉండేలా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ప్రతి రోజు రైతుల నుంచి తీసుకున్న ధాన్యం వివరాలను నమోదు చేసేందుకు ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి పంపించాలన్నారు. కొనుగోలు చేసిన రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.33 కోట్ల మందులు సీజ్

యాంటిబయోటిక్ తయారీ ఒకరిది.. పేరు మరొకరిది

నిబంధనలకు విరుద్ధంగా మందుల తయారీ

పెద్దఎత్తున రష్యాకు తరలిస్తున్న ఔషధాలు

సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఒక కంపెనీలో తయారైన ఔషధాలను మరో కంపెనీ పేరు పేరుతో విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఓ ఫార్మా కంపెనీ గుట్టును డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు రట్టు చేశారు. సదరు కంపెనీపై దాడులు జరిపి రూ.1.33 కోట్ల విలువజేసే నాలుగు రకాల యాంటీబయోటిక్ మందులను సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ వి.బి.కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... సిద్ధిపేట్ జిల్లా, కరకపట్లలోని 'జొడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై.లి'కి విదేశాలకు ఔషధాలు ఎగుమతి చేసే లైసెన్స్ ఉంది. దీంతో సదరు కంపెనీ వివిధ రకాల ఔషధాలను రష్యాకు ఎగుమతి చేస్తున్నది. అయితే డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం 1940 ప్రకారం ఔషధాలు తయారు చేసే కంపెనీ మాత్రమే విదేశాలకు ఎగుమతి చేయాలి. అంటే ఔషధాలను ఎగుమతి చేసే అనుమతి ఉన్న కంపెనీలు ఎగుమతి చేయబోయే ఔషధాలను ఆ కంపెనీ మాత్రమే తయారు చేయాలి. కానీ అందుకు విరుద్ధంగా జోడాస్ ఎక్స్‌పోయిమ్ కంపెనీ పలు రకాల యాంటీబయోటిక్ మందులను స్వయంగా తయారు చేయకుండా నగరంలోని మేడ్చల్-మల్కాజిగిరిలో ఉన్న జీనోమిక్స్ ప్రై.లిలో తయారు చేసిన అంపిసిలిన్ ప్లస్ సల్బాక్టమ్ 1000ఎంజి ప్లస్ 500ఎంజి ఇంజక్షన్లను, మహారాష్ట్రలోని జజెన్ ఫార్మ ప్రై.లిలో తయారు చేసిన అమాక్సిలిన్ 1000ఎంజి ప్లస్ క్లావులానికాసిడ్ 200ఎంజి, మెరోపెనమ్ 500ఎంజి ఇంజక్షన్లను జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై.లి. తయారు చేసినట్లు ఔషధాలపై లేబుల్స్ అంటించి రష్యా దేశానికి ఎగుమతి చేస్తున్నారు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు బుధవారం సిద్ధిపేట, కరకపట్లలోని బయోటెక్ పార్క్‌లో ఉన్న 'జొడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రై.లి.'ఫార్మ కంపెనీపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇతర కంపెనీల్లో తయారు చేసిన ఔషధాలను తమ కంపెనీ తయారు చేసినట్లు తప్పుడు లేబుల్స్ ముద్రించి రష్యాకు దిగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.1.333 కోట్ల విలువజేసే 38,175 వైల్స్ యాంటీబయోటిక్ ఔషధాలను సీజ్ చేశారు. డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిపిన ఈ దాడుల్లో డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ పి.రాము, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ సుష్మి, సీహెచ్.కార్తిక్ శివ చైతన్య, టి.శివతేజ, పి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్

వికారాబాద్, నవంబర్ 27 : అపోలో ఫార్మసీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, వికారాబాద్ ఐటీఐ క్యాంపస్‌లో ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. అపోలో ఫార్మసీలో 50 పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీ-ఫార్మా, డీ-ఫార్మ్, ఎం-ఫార్మసీ విద్యార్హత ఉండాలన్నారు. వికారాబాద్, మోమిన్‌పేటలోని ప్రైవేటు పరిశ్రమలకు అవసరమయ్యే సిబ్బందిని ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 ద్వారా సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 27 : ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొ. జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే పీజీ డిప్లొమా ఇన్ డేటా సైన్స్ కోర్సు పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.శశికాంత్ తెలిపారు. ఈ కోర్సు మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తర్వాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 30వ లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. శశికాంత్ తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్), బీ ఫార్మసీ (పీసీఐ) ఏడో సెమిస్టర్ పరీక్షల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. వాటిని వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.